


17న పార్వతీపురంలో జాబ్ మేళా

ప్రజాశక్తి -పార్వతీపురం టౌన్

పార్వతీపురంలో ఈనెల 17న జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి ఆర్.వహీదా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించే నిమిత్తం హెటెరో ల్యాబ్స్ లిమిటెడ్, క్రెడిట్ యాక్సెస్ గ్రామీన్ లిమిటెడ్ కంపెనీల సౌజన్యంతో జాబ్ మేళాను ఏర్పాటు చేశామని చెప్పారు. 270 ఖాళీలున్నాయని, 18 నుంచి 35ఏళ్ల వయస్సు కలిగి, డిగ్రీ అర్హత గల యువత అర్హులని ఆమె చెప్పారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈనెల 17న ఉదయం 10.30 గంటల నుండి జాబ్ మేళా జరుగుతుందన్నారు. కావున అర్హత, ఆసక్తిగల యువత ఙ్షఙ్ష.అఎం.స్త్రశీఙ.ఱఅ వెబ్ సైట్ లో జాబ్ సీకర్ లాగ్ ఇన్ లో నమోదు కావాలని ఆమె సూచించారు.

అంతులేని అసమానతలు

- అక్షరాస్యతలో అట్టడుగు స్థానం
- దవాఖానాలకు తప్పని డోలీ మోత
- వలసకూలీలుగా మారిన వ్యవసాయ కుటుంబాలు
- దుర్భిక్ష పరిస్థితుల నడుమ నేడు స్వాతంత్ర్య వేడుకలు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

అందరితోపాటే ఉమ్మడి విజయనగరం జిల్లాకూ స్వాతంత్ర్యం వచ్చింది. మన జిల్లా నుంచీ అనేక మంది ఉద్దండులు స్వాతంత్ర్యోద్యమంలో పోరాడి జైళ్లకు వెళ్లారు. ఉద్యమంలో ప్రాణాలర్పించారు. కానీ, మిగిలిన జిల్లాలతో పోల్చినప్పుడు అభివృద్ధిలో మన ప్రాంతం అథమ స్థానంలోనే ఉండిపోయింది. అక్షరాస్యతలోనూ అట్టడుగు. సర్కారు దవాఖానాలకు వెళ్లాలంటే నేటికీ డోలీ మోతే. అదుపులేని నిరుద్యోగం. ఎటూ సరిపోని తలసరి ఆదాయం. ఒకప్పుడు రాజుల్లా బతికే రైతులు నేడు పొట్టచేతపట్టుకుని పట్టణాలకు వలసపోయారు. రైతులు చిన్నాభిన్నమయ్యారు. ఈ క్రమంలో అంతులేని అసమానతలు పెరిగాయి. దళారీ వ్యవస్థ నాటి బ్రిటీష్ పాలనలో మాదిరిగానే కొనసాగుతోంది. వీటన్నింటికీ కారణం ఓ సినీ కవి చెప్పినట్టు పాలకుల నిర్లక్ష్యం, పదవీ వ్యామోహాలు, కుల మత భేదాలు ఒక కారణమైతే, ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలు మరోకారణంగా చెప్పుకోవచ్చు. ఇటువంటి దుర్భిక్ష పరిస్థితుల నడుమ మన జిల్లా అధికార యంత్రాంగం గురువారం 78వ స్వాతంత్ర్య వేడుకలు నిర్వహిస్తోంది.

ఉమ్మడి విజయనగరం జిల్లాకు పోరాటాలు కొత్తేమీ కాదు. బ్రిటిష్ వారి నియంతృత్వాలపై 1910లోనే మన జిల్లాకు చెందిన మహాకవి గురజాడ అప్పారావు కలం కత్తి ఝుళిపించారు. దొరల పాలనకు వ్యతిరేకంగా 1921లో జరిగిన సహాయ నిరాకరణ ఉద్యమంలో చింతకండి సత్యనారాయణ తన రైల్వే ఉద్యోగానికి రాజీనామా చేసి పాల్గొన్నారు. పసుమర్తి వీరభద్రస్వామి, కలిమిశెట్టి రామమూర్తి, ఉల్లి తిరుపతి, ధర్మవరానికి చెందిన అల్లు జోగినాయుడు తదితరులు ఉద్యమంలో భాగస్వామ్యమై జైలు జీవితం అనుభవించారు. విజయనగరానికి చెందిన ద్వారకాభమిటి రామదీక్షితులు, జొన్నవలసకు చెందిన పూసపాటి బుచ్చి సీతారామచంద్రరావు ఉప్పుసత్యాగ్రహంలో పాల్గొన్నారు. విదేశీ వస్తువుల బహిష్కరణపై సాలూరు, చీపురుపల్లి, బొబ్బిలి ప్రాంతాల్లో పెద్దఎత్తున ప్రచార సభలు నిర్వహించారు. స్వాతంత్ర్యోద్యమంలో కీలకంగా భావిస్తున్న మహాత్మాగాంధీ విజయనగరంలో ముచ్చటగా మూడు సార్లు పర్యటించారు. ఇలా చెప్పుకుంటూ పోతే మన జిల్లా నుంచి ఎంతోమంది ఉద్యమంలో పాల్గొని సమసమాజం కోసం ప్రాణత్యాగాలు చేశారు. కానీ, వారి త్యాగాలకు తగిన ఫలితాలు మన జిల్లాకు దక్కలేదన్నది సర్కారీ లెక్కలే తార్కాణం. ఉపాధి, ఉద్యోగ మార్గాలు చూపే పారిశ్రామిక రంగంలో జిల్లా ఇప్పటికీ చివరి స్థానంలోనే ఉంది. చిన్నాచితక తప్ప భారీ పరిశ్రమలు మన జిల్లాలో లేవు. ఒకప్పుడు జ్యూట్‌మిల్లులకు పుట్టినిల్లుగా ఉండేది మన ప్రాంతం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలు, ఉదాసీనత వెరసి దాదాపు మిల్లులన్నీ మూతపడ్డాయి. ప్రస్తుతం వాటి ఉనికే లేకుండా పోయింది. ఫెర్రో ఎల్లాయీస్ పరిశ్రమలు కూడా సుమారు పది వరకు కనుమరుగయ్యాయి. బొబ్బిలి, సారిపల్లి, కంటకాపల్లి పారిశ్రామిక వాడల్లో పరిశ్రమలు లేక లేఅవుట్లు వెలవెలబోతున్నాయి. ఇలా కొత్తగా పరిశ్రమలు ఏర్పాటు కాక, ఉన్న పరిశ్రమలు మూతపడి ఉన్న ఉద్యోగాలు, ఉపాధి మార్గాలు పోయాయి. దీంతో, పారిశ్రామిక వృద్ధిరేటు క్షీణిస్తోంది.



నేటికీ డోలీపై గర్భిణిని ఆసుపత్రికి తరలిస్తున్న గిరిజనులు (ఫైల్)

జిల్లాలో ప్రత్యక్షంగా, పరోక్షంగా 70శాతం ప్రజానీకం జీవనాధారంగా ఉన్న వ్యవసాయరంగం నానాటికీ దిగజారుతోంది. పుష్కలమైన సాగునీటి వనరులున్నా వాటిని సద్వినియోగం చేసే పాలకులే కొరవడ్డారు. దీంతో స్వాతంత్ర్యం వచ్చి 77 ఏళ్ల కావస్తున్నా కరువు కాటకాలకు, ప్రకృతి వైపరీత్యాల ఆగ్రహానికి రైతులు, వారిపై ఆధారపడిన కార్మికులు, వృత్తిదారులు గురికావాల్సి వస్తోంది. వ్యవసాయరంగం వృద్ధిరేటు కేవలం రూ.13,343 కోట్లే. సేవా రంగం విస్తరణకు పుష్కలమైన అవకాశాలున్నా ఆశించిన పురోగతి లేదు. గుండె, ఊపిరితిత్తులు తదితర రోగాలకు మన జిల్లాలో సూపర్‌స్పెషాలిటీ వైద్యసేవలు లేవంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. జనాభాకు తగినన్ని ఆసుపత్రులు, పాఠశాలలు లేవు. దీంతో, ఏజెన్సీలో ఇంకా డోలిమోతలు, పసరమందులు తప్పడం లేదు. చాలా గ్రామాలకు తాగునీటి సదుపాయం లేదు. అభివృద్ధికి ఆయువుపట్టులాంటి విద్యలో మన జిల్లా అట్టడుగు స్థానంలో ఉంది. తగినన్ని స్కూళ్లు, కాలేజీలు లేవు. ఉన్న బడులను సైతం మూసివేయడంతో విద్యకు దూరమౌతున్నారు. జిల్లా అక్షరాస్యతా శాతం 58.89శాతం మాత్రమే. అక్షరాస్యత లేమిని ఆసరా చేసుకుని జిల్లాలో నిధులు, వ్యవసాయ ఉత్పత్తులు సర్కారు దోపిడీ చేయడంతో ప్రజల తలసరి ఆదాయం రూ.1,30,203కు పరిమితమైంది. ఇది ఏమాత్రమూ సరిపోకపోవడంతో అర్ధాకలితో అలమటిస్తున్నవారు, తల్లిదండ్రులను పోషించుకోలేక, పిల్లల్ని చదవించుకోలేక పొట్టచేతపట్టుకుని ఊరూ, వాడ వదిలి వలసపోతున్న కుటుంబాలు కోకొల్లలు. డిగ్రీ, పీజీ పట్టాలు పట్టుకుని ఉద్యోగాల కోసం విదేశాలకు పోతున్నవారూ తక్కువేం కాదు. వీరికి శాశ్వత ప్రాతిపదికన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు చూపాల్సిన పాలకులు పట్టణ కేంద్రాల్లో ఏపూటకాపూట పట్టెడు అన్నం పెట్టి, అదే గొప్ప ఘనకార్యంగా చెప్పుకుంటున్నారు. బహుశా ఇటువంటి వారికోసమే విజయనగరం జిల్లా కేంద్రంలో గడిచిన ఐదేళ్లు ఫుడ్ బ్యాంకులు (మిగిలిపోయిన ఆహారాన్ని పంచేందుకు ఏర్పాటుచేసినవి) నడిపారు. తాజాగా అన్న క్యాంటీన్లు పునఃప్రారంభానికి సిద్ధమయ్యారు. ఇదేమీ గొప్ప విషయం కాదు. కటిక పేదరికం ఉందనడానికి ఇదో మచ్చుతునకగా చెప్పుకోవచ్చు. మత్స్యకారులు, గిరిజనులు నేటికీ సమాజాభివృద్ధికి దూరంగానే మిగిలిపోయారు. ఇటువంటి పరిస్థితుల్లో 'స్వాతంత్ర్యం వచ్చెననీ... సభలె చేసీ సంబర పడగానే సరిపోదోయి' అంటూ స్వాతంత్ర్య అనంతర పరిణామాలను చాటి చెప్పిన మహా కవి శ్రీశ్రీ విశ్లేషణలు ప్రతిఒక్కరూ, ముఖ్యంగా పాలకులు అన్వయించుకోవాల్సిన అవసరం ఉంది. 'సాధించిన దానికి సంతృప్తిని పొందీ అదె విజయమనుకుంటే పొరపాటోయి' అన్న మాటలను ప్రజలు బోధపర్చుకోవాలి. వీరుల త్యాగఫలాన్ని గుర్తుచేసుకుని దోపిడీదారులపై పిడికిలి బిగించి సమానత్వం కోసం పాటుపడాలి.



అన్న క్యాంటీన్‌కు శంకుస్థాపన చేస్తున్న మంత్రి సంధ్యారాణి

పేదల ఆకలి తీర్చడానికే అన్న క్యాంటీన్

భూమి పూజ చేసిన మంత్రి సంధ్యారాణి • రూ.5లక్షల విరాళం

ప్రజాశక్తి - సాలూరు

పేదల ఆకలి తీర్చడానికే రాష్ట్ర ప్రభుత్వం అన్ని నియోజకవర్గాల్లో అన్న క్యాంటీన్లను ప్రారంభిస్తున్నట్లు గిరిజన సంక్షేమ, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి చెప్పారు. బుధవారం స్థానిక మండల తహశీల్దార్ కార్యాలయం ఆవరణలో ఉన్న ఖాళీ స్థలంలో రూ.60లక్షలతో అన్న క్యాంటీన్ నిర్మాణానికి మాజీ ఎమ్మెల్యే ఆర్పీ భంజ్ దేవ్‌తో కలిసి ఆమె భూమి పూజ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పేదల ఆకలి తీర్చే అన్న క్యాంటీన్లను గత ప్రభుత్వం ధ్వంసం చేసిందని ఆరోపించారు. టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సిఎం చంద్రబాబు నాయుడు అన్న క్యాంటీన్‌కు సంబంధించిన తొలి ఫైల్‌పై సంతకం చేశారని చెప్పారు. నియోజకవర్గంతో పాటు పట్టణంలోని భవన నిర్మాణ కార్మికులు, కూలీలు, చిరు వ్యాపా రులు, రోడ్డు పక్కన కూరగాయలు అమ్ముకునే వ్యాపారులు అన్న క్యాంటీన్‌లో భోజనం చేయొచ్చు నని చెప్పారు. ఐదు రూపాయలకే సంతృప్తికర మైన భోజనం పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. ఐదు రూపాయలకు టీ కూడా రాని ఈ రోజుల్లో అన్న క్యాంటీన్‌లో అదే ధరకు భోజనం పెట్టడమం టే దాదాపు ఉచితమనే భావించవచ్చు నని చెప్పారు. పేదలు వినియోగిం చుకోవాలని కోరారు. పట్టణంలో ఎవరైనా పుట్టిన రోజు వేడు కలు, చావు, పుట్టుకల సందర్భంలో వారి పేరిట విరాళాలు ఇచ్చుకోవాలని సూచించారు. తన వంతు రూ.ఐదు లక్షలు ఆర్థిక సహాయం చేస్తున్న ట్లు ప్రకటించారు. ఎవరైనా దాతలుంటే ముందుకు రావాలని ఆమె కోరారు. ఎఎంసి మాజీ చైర్మన్ కేతిరెడ్డి చంద్రశేఖర్ రూ.లక్షలు, పట్టణ టిడిపి అధ్యక్షులు నిమ్మాది తిరుపతిరావు రూ.20వేల ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమం లో పట్టణ టిడిపి నాయకులు కొనిసి వేణుగోపాల్, బి.అశోక్, కౌన్సిలర్లు వరలక్ష్మి, వైదేహి, కృష్ణారావు, హర్షవర్ధన్, లక్ష్మోజీ, మండల టిడిపి అధ్యక్షులు ఆముదాల పరమేష్, మున్సిపల్ కమిషనర్ ప్రసన్నవాణి తదితరులు పాల్గొన్నారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, జెసి శోబిక, ఎఎస్‌పి దిలీప్‌కుమార్

స్వాతంత్ర్య దినోత్సవం వేడుకలకు ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి పార్వతీపురంరూరల్

స్వాతంత్ర్య దినోత్సవ నిర్వహణకు జిల్లా సిద్ధమైయింది. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో జరుగుతున్న స్వాతంత్ర్య దినోత్సవ ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ బుధవారం పరిశీలించారు. వేదిక ఏర్పాట్లు, అతిథులు కూర్చొనే గ్యాలరీలు, వివిధ శాఖలు ఏర్పాటు చేసే ప్రదర్శనలు, మైదానంలో ఇతర ఏర్పాట్లను పర్యవేక్షించారు. పోలీసు కవాతును తనిఖీ చేశారు. బుధవారం ఉదయం 9 గంటలకు రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి ముఖ్య అతిథిగా హాజరై జాతీయ జెండాను ఎగుర వేస్తారని కలెక్టర్ తెలిపారు. పెరేడ్‌ను పరిశీలిస్తారని, జిల్లా సాంస్కృతిక కార్యక్రమాలు, వివిధ శాఖల అభివృద్ధిని సూచించే శకటాలు, ప్రదర్శన శాలలు ఏర్పాటు చేస్తున్నారని చెప్పారు. పక్కాగా ఏర్పాట్లు ఉండాలని సూచించారు. ఉత్తమ సేవలందించిన ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు పొందిన వారికి కుర్చీలను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో జెసి ఎస్ఎస్ శోబిక, ఎఎస్‌పి డాక్టర్ ఒ.దిలీప్ కిరణ్, ఆర్‌డిఒ కె.హేమలత, పలువురు జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఏనుగుల దాడిలో ఇల్లు ధ్వంసం

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని జరడ పంచాయతీ గెడ్డగూడలో ఏనుగులు దాడిలో ఇల్లు ధ్వంసమైంది. స్థానికుల కథనం ప్రకారం మండంగి చిన్నయ్య ఇంటిపై ఏనుగులు అమాంతంగా దాడి చేయడంతో కుటుంబ సభ్యులతో కలిసి పరుగులు తీసి ప్రాణంతో బయటపడ్డారు. అయితే ఇంట్లో ఉన్న ధాన్యం, బియ్యం , నిత్యవసర వస్తువులను ఇంటికి ధ్వంసం చేశాయి. ఇల్లు పూర్తిగా ధ్వంసం కావడంతో ఉండడానికి నిలువు నీడ లేకుండా పోయిందని, దీంతో ఆ కుటుంబం రోడ్డును పడిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయినా అధికారుల్లో కనీస చలనం లేదన్నారు ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఏనుగులను దూర ప్రాంతాలకు తరలించి మా ప్రాణాలకు, పంటలకు రక్షణ కల్పించాలని కోరుతున్నారు.

తరాలు మారుతున్నా మారని పేదల బతుకులు

సామూహిక జనజాగరణ కార్యక్రమంలో వక్తలు

ప్రజాశక్తి పార్వతీపురంరూరల్

స్వాతంత్ర్యం వచ్చి 78 ఏళ్ల పూర్తి చేసుకున్నా పేదల బతుకులు మారడం లేదని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.మన్మధరావు, శ్రామిక మహిళా సంఘం నాయకులు వి.ఇందిరా అన్నారు. 78వ స్వాతంత్రం దినోత్సవం పురస్కరించుకొని స్థానిక గిరిజన సామాజిక భవనంలో సిఐటియు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో బుధవారం జనజాగరణ జరిగింది. ఈ కార్యక్రమాన్ని పురస్కరించుకొని పలు సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం మన్మధరావు, ఇందిర మాట్లాడుతూ స్వాతంత్ర్య ప్రతిఫలాలు కష్టజీవులకు, శ్రామికులకు, రైతులకు, మహిళలకు, విద్యార్థులకు దళిత, గిరిజనులకు రాజ్యాంగం కల్పించిన హక్కులు అందడం లేదని అన్నారు. బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వం రంగ సంస్థలను, ప్రకృతి సంపదను కార్పొరేట్లకు తెగ అమ్ముతుందని విమర్శించారు. రాజ్యాంగం కల్పించిన లౌకిక, ప్రజాస్వామ్య విలువలను అంతమొందిస్తుందన్నారు. ధరలు విపరీతంగా పెంచి ప్రజల కొనుగోలు శక్తిని దెబ్బతీస్తుందని, కార్మికులకు కనీస వేతనాలు, కార్మిక హక్కులు అమలు చేయడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలో మత సామరస్యాన్ని దెబ్బతీస్తూ కుల, మత, ప్రాంతీయ గొడవలు రేపుతుందన్నారు. ఏ స్వాతంత్రం కోసం ఏ గ్రామ స్వరాజ్యం కోసం మహాత్మా గాంధీ కలలు కన్నాడో ఆ గ్రామ స్వరాజ్యం గంగ పాలవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కావున స్వాతంత్ర్య ప్రతిఫలాలు కార్మికులకు ప్రజలకు దక్కాలని, మరో స్వాతంత్ర పోరాటానికి సిద్ధం కావాలని, మత సామరస్య విలువలను దేశ రాజ్యాంగాన్ని, లౌకికత్వాని, దేశ సార్వభౌమత్వాన్ని కాపాడుకోవాలని జన జాగరణ సందర్భంగా పిలుపు ఇచ్చారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రాజు, పండు, సిఐటియు నాయకులు రెడ్డి వేణు, గంట జ్యోతి, బంకురు సూరిబాబు కొల్లి సాంబమూర్తి, శాంతికుమారి, స్కీం వర్కర్లు, మున్సిపల్, ఆర్‌టిసి కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



సాలూరులో పాటలు పాడుతున్న ప్రజానాట్యమండలి కళాకారులు

సాలూరు : ఆనాటి స్వాతంత్ర్య పోరాట స్ఫూర్తిని నేటి తరాలకు చాటి చెప్పాల్సిన అవసరం వుందని ప్రజా సంఘాల నాయకులు చెప్పారు. ఆగష్టు 15 స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం పట్టణంలో ప్రజాసంఘాల నాయకులు, కార్యకర్తలు జనజాగరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్వై నాయుడు మాట్లాడుతూ స్వాతంత్ర్యం కోసం జరిగిన సమరంలో బిజెపి, ఆర్ఎస్ఎస్‌ల పాత్ర లేకపోయినా గత పదేళ్లుగా దేశాన్ని పాలిస్తున్నాయని చెప్పారు. దేశం కోసం ఆనాడు భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ దేవ్, అల్లూరి సీతారామరాజు లాంటి యోధులు ప్రాణాలర్పించారని చెప్పారు. కార్యక్రమంలో ప్రజానాట్యమండలి నాయకులు కోరాడ ఈశ్వరరావు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఎం.శ్రీనివాసరావు, సిఐటియు నాయకులు రాముడు, శంకరరావు పాల్గొన్నారు.



పార్వతీపురంలో జరిగిన జనజాగరణలో నృత్యం చేస్తున్న విద్యార్థులు

పాఠశాలల్లో పతాకావిష్కరణపై వీడని సందిగ్ధత

ప్రజాశక్తి పార్వతీపురంరూరల్

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఉన్నత, ప్రాథమిక పాఠశాలలో జాతీయజెండాను ఎవరు ఎగుర వేస్తారని ప్రజాప్రతినిధులు ప్రశ్నిస్తున్నారు. గత మూడేళ్లు విద్యాకమిటీ చైర్మన్లు జెండా ఎగురవేశారని పలువురు సర్పంచులు తెలిపారు. ఉపముఖ్యమంత్రి, రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల నిర్వహణకు పెద్దఎత్తున పంచాయతీ నిధులు నిధులు కేటాయిస్తూ ఆదేశాలు జారీ చేస్తున్న సంగతి తెలిసిందే. పంచాయతీల అధికారాలను పునరుద్ధరణ చేస్తామని ప్రకటించిన సంగతి తెలుస్తుంది. ఈ దశలో పాఠశాలల్లో జాతీయ జెండా ఎవరు ఎగురవేయాలన్న అంశంపై జిల్లా అధికారులు ఆదేశాలు జారీ చేయాలని సర్పంచులు కోరుతున్నారు. దీనిపై ఇంతవరకు తమకు ఎటువంటి ఆదేశాలు రాలేదని డిఇఒ, ఎంఇఒ తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల కోసం ఎదురుచూస్తున్నట్లు వారు తెలిపారు. ఈదశలో ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులకు కూడా ఇంతవరకు తాము జెండా ఎగరవేయడానికి అటు సర్పంచులను గానీ, ఇటు కమిటీ చైర్మన్లను గానీ కలవలేకపోయామని తెలిపారు. ఇప్పటికైనా స్పందించి ప్రభుత్వ నిర్ణయం తక్షణమే ప్రకటన చేయాలని ఉపాధ్యాయవర్గం కోరుతుంది.

సహారా ఇండియా ఖాతాదారుల సొమ్ము చెల్లింపునకు

పోరాటం ఉధృతం : సిఐటియు

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

సహారా ఇండియా ఖాతాదారులు డబ్బు చెల్లింపునకు కేంద్ర ప్రభుత్వం హామీ అమలు కోసం పోరాటం ఉధృతం చేయాలని, అందుకు పక్కా కార్యాచరణ ప్రణాళికతో ముందుకు సాగాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రెడ్డి వేణు అన్నారు. బుధవారం స్థానిక సుందరయ్య భవనంలో సీనియర్ ఏజెంట్ శ్రీనుబాబు అధ్యక్షతన నిర్వహించిన సహారా ఇండియా ఏజెంట్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్వతీపురం బ్రాంచ్ పరిధిలో సుమారు 40వేల మంది ఖాతాదారులకు రూ.100 కోట్లు పైగా చెల్లింపులు జరగాల్సి ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం దగ్గర సహారా ఇండియా ఖాతాదారుల చెల్లింపులు కోసం డిపాజిట్ చేసిన మొత్తాన్ని ఖాతాదారులకు చెల్లించడంలో చేస్తున్న జాప్యాన్ని ఎండగడుతూ పోరాట కమిటీగా ఏర్పడి నిరసనలను ఉధృతం చేయాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. అందుకు వివిధ రూపాల్లో నిరసన తెలియజేయాల్సి ఉంటుందన్నారు. ఆగస్టు 30లోపు నియోజకవర్గాల్లో ర్యాలీలు, వినతులు అందజేత, సెప్టెంబర్ 5న పార్వతీపురంలో ఖాతాదారులతో భారీ ర్యాలీ, మానవహారం చేయాలని పోరాట కమిటీ పిలుపునిచ్చింది. ఈ కార్యక్రమంలో సహారా ఖాతాదారులు శ్రీనుబాబు, జి.లక్ష్మణరావు, వడ్డి శ్రీనివాసరావు, పి.గౌరీ శంకర్రావు, మండలాల ప్రతి నిధులు పాల్గొన్నారు.

జిల్లా వ్యాప్తంగా ఘనంగా హర్ ఘర్ తిరంగా



పార్వతీపురంలో ర్యాలీ చేస్తున్న జెసి, డిఆర్ఒ, ఆర్‌డిఒ తదితరులు

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

హర్ ఘర్ తిరంగా కార్యక్రమం జిల్లాలో బుధవారం ఘనంగా జరిగింది. ప్రతి పౌరునిలో దేశభక్తి భావాన్ని రగిలించి దేశ సమగ్రతను పెంపొందించాలని జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్ శోబిక పిలుపునిచ్చారు. స్వాతంత్ర దినోత్సవ వేడుకలు పురస్కరించుకొని ఆజాద్ కా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా స్థానిక ఆర్‌సిఎం స్కూల్ సముదాయం నుండి కలెక్టర్ కార్యాలయం వరకు హర్‌ఘర్ తరంగ ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులతో సాగిన చైతన్య ర్యాలీని జాయింట్ కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పౌరునిగా దేశ సమగ్రతను, జాతీయ సమైక్యతను కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని పేర్కొన్నారు. దేశ సమగ్రతను సామరస్యాన్ని, జాతీయ పతాకం ప్రాముఖ్యతను మరింత పెంపొందించేందుకు హర్ ఘర్ తరంగ మహోన్నతమైన కార్యక్రమమని అన్నారు. దేశం కోసం ప్రాణాలర్పించిన మహనీయుల జీవిత గాధను మననం చేసుకొని దేశాభివృద్ధికి యువత పునరంకితం కావాలని పునరుద్ఘాటించారు. ప్రతి భారతీయునిలో దేశభక్తి పెంపొందించేలా హర్‌ఘర్ తిరంగా కార్యక్రమాన్ని జిల్లాలో నిర్వహిస్తున్నట్టు తెలిపారు. జిల్లా యంత్రాంగంతో పాటు స్వచ్ఛంద సంస్థలు, యువత భాగస్వామ్యులు కావాలని, దేశ సమగ్రతను కాపాడే ఈ మహోన్నత కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ ఉత్సాహంగా పాల్గొని విజయవంతం చేయాలని, దేశభక్తి పెంపొందించాలని ఆమె పిలుపు నిచ్చారు. స్వాతంత్ర పోరాటంలో పాల్గొన్న స్వాతంత్ర సమరయోధులను, వారి నిస్వార్థ సేవలను ఆమె కొనియాడారు. కార్యక్రమంలో డిఆర్ఒ జి.కేశవనాయుడు, ఆర్‌డిఒ కె.హేమలత, డిఇఒ జి.పగడాలమ్మ, స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలలు, కళాశాలల విద్యార్థినీ, విద్యార్థులు తదితరులు, పాల్గొన్నారు.

పాలకొండ : ప్రతిఒక్కరూ దేశభక్తిని అలవరుచుకోవాలని ఆర్‌డిఒ వివి రవణ అన్నారు. బుధవారం స్థానిక తహశీల్దారు కార్యాలయం ముందు హర్‌ఘర్ తిరంగపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ప్రతి ఇంటి ముందు జెండా ఉండాలన్నారు. కార్యక్రమంలో తహశీల్దారు బాలమురళీకృష్ణ, కమిషనర్ సర్వేశ్వరరావు, తదితరులు ఉన్నారు.

గుమ్మలక్ష్మీపురం : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో హర్ ఘర్ తరంగా కార్యక్రమాన్ని విద్యార్థులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు కళాశాల నుంచి ఎల్విన్‌పేట జంక్షన్ వరకు ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ ప్రిన్సిపల్ డి.రామయ్య మాట్లాడారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు తులసి, కల్పన, అశోక్, శ్రీవాణి, స్వరూప, కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీతానగరం : హర్ ఘర్ తిరంగా కార్యక్రమంను మండల కేంద్రంలో బుధవారం నిర్వహించారు. ప్రతి పౌరునిలో దేశభక్తి భావాన్ని పెంపొందించేందుకు స్వాతంత్ర దినోత్సవ వేడుకలు పురస్కరించుకొని ఆజాద్ కా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా హర్ ఘర్ తరంగ ర్యాలీని నిర్వహించామని ఇన్‌ఛార్జి ఎంపిడిఒ కె.కుమార్ వర్మ, తహశీల్దార్ జె.రాములమ్మ, ఎఒ ప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, పంచాయతీ సర్పంచులు ,కార్యదర్శులు, సిబ్బంది మండల పరిషత్ సిబ్బంది,తహసీల్దార్ కార్యాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కురుపాం : మండల కేంద్రమైన కురుపాంలో సచివాలయ సిబ్బంది హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ ఇంటిపై జాతీయ జెండాను ఎగరవేసి దేశంపైనా, స్వాతంత్ర సమరయోధులపై ఉన్న ప్రేమను చాటి చూపాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బి.అనిత, వీఆర్వో మహేంద్ర, వెల్ఫేర్ అసిస్టెంట్ చేతన్ తదితరులు పాల్గొన్నారు.

పాచిపెంట : మండల కేంద్రంలో బుధవారం హర్ గర్ తిరంగా ఘనంగా జరిగింది. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుండి చిన్న బజార్ కూడలి వరకు ర్యాలీని విద్యార్థినీ విద్యార్థులతో నిర్వహించారు. ఈ ర్యాలీని తహశీల్దార్ డి.తరవి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ సమగ్రత, జాతీయ సమైక్యతను కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ ఎం.రాజశేఖర్, ఆర్ఐ రమణారావు, విఆర్ఒలు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీతంపేట : హర్ ఘర్ తిరంగా ర్యాలీ ఉప తహశీల్దార్ నాగేంద్ర కుమార్ ఆధ్వర్యంలో జరిగింది. ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎరగాలని ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తహశీల్దార్ పి.అప్పలరాజు, ఎంపిడిఒ కె.గీతాంజలి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

జియ్యమ్మవలస : తహశీల్దార్ సీతారామయ్య, ఎంపిడిఒ శ్రీనివాసరావులు తమ సిబ్బందితో కలిసి స్థానిక మండల పరిషత్ కార్యాలయం నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటిపైనా మువ్వన్నెల జెండా రెప రెపలాడాలి : కలెక్టర్

ఆజాది కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా హర్ ఘర్ తిరంగా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ ఏ శ్యామ్ ప్రసాద్ తెలిపారు. జాతీయ సమైక్యతను చాటి చెప్పేలా ప్రతి పౌరుడు తన ఇంటి పైన మువ్వన్నెల జెండాను ఎగుర వేయాలని కోరారు. హర్ ఘర్ తిరంగా కార్యక్రమంపై బుధవారం సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అన్ని పాఠశాలల్లో పిల్లలతో ప్రతిజ్ఞ చేయించి, జాతీయ జెండాలను చేత పట్టి ర్యాలీలు నిర్వహించాలని, వాటి ఫోటోలను హర్ ఘర్ తిరంగా వెబ్సైటు లో అప్లోడ్ చేయాలనీ ఆదేశించారు. ప్రతి పంచాయతీ స్థాయిలో జాతీయ సమైక్యతపై పోటీలు నిర్వహించాలని తెలిపారు. డ్వాక్రా మహిళలతో కూడా పెద్ద ఎత్తున జెండాలను చేత పట్టి గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించాలని సూచించారు. అదే విధంగా మున్సిపాలిటీల్లో, బస్సు స్టాండ్లలో, రైల్వే స్టేషన్ తదితర ప్రాముఖ్యత ఉన్న కూడళ్లలో సెల్ఫీ పాయింట్లు ఏర్పాటు చేయాలని, ఫోటోలు దిగి అప్లోడ్ చేసేలా చర్యలు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్లకు ఆదేశించారు.



పాలకొండలో ర్యాలీ చేస్తున్న ఆర్‌డిఒ రమణ, అధికారులు, సిబ్బంది

ప్రజాశక్తి
www.prajasakti.com



విద్యార్థులను అభినందిస్తున్న ఎమ్మెల్యే విజయచంద్ర

జాతీయ స్థాయి పోటీల్లోనూ రాణించాలి

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

జిల్లా క్రీడాకారులు జాతీయస్థాయిలో పతకాలు సాధించాలని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర ఆకాంక్షించారు. ఇటీవల రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీల్లో పతకాలు సాధించిన విద్యార్థులు బుధవారం క్యాంపు కార్యాలయంలో ఆయన్ను కలిసిన క్రీడాకారులను ఎమ్మెల్యే అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రస్థాయిలో ఒక బంగారు, మూడు రజత, మూడు కాంస్య పతకాలను సాధించిన విద్యార్థులు భవిష్యత్తులో మరిన్ని విజయాలు అందుకోవాలన్నారు. క్రీడాకారులతో పాటు కోచ్ అనిల్ కుమార్ శర్మను, బంగారు పతకం సాధించి మహారాష్ట్రలోని ఔరంగాబాద్‌లో జరిగే జాతి స్థాయి పోటీలకు వెళ్తున్న హర్షిత్‌శర్మను ఎమ్మెల్యే అభినందించారు.

21న బహిరంగ వేలం పాట

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

జిల్లా కేంద్రంలో మున్సిపల్ ఆస్తులకు సంబంధించి తోటపల్లి హెడ్ వాటర్ వర్క్స్ వద్ద గల కొబ్బరి, మామిడి, జీడి చెట్ల ఫలసాయాన్ని 2024–25 నుండి 2026–27 వరకు అనుభవించే హక్కు పొందేందుకు బహిరంగ వేలం పాటను ఈనెల 21న ఉదయం 11 గంటలకు మున్సిపల్ కమిషనర్ కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో కానీ వారి అనుమతి పొందిన వారితో గాని, రెవెన్యూ విభాగం అధికారుల సమక్షంలో బహిరంగ వేలంపాటను నిర్వహించనున్నట్టు మున్సిపల్ రెవెన్యూ విభాగం అధికారి రుబీను దిబ్బ తెలిపారు. ఆసక్తి గలవారు లక్ష రూపాయలు సాల్వెన్సీ ధ్రువీకరణ పత్రాలతో పాటు రూ.75వేలు ధరావత్తు చెల్లించి వేలంపాటలో పాల్గొనాలని తెలిపారు. అదనపు సమాచారం కొరకు మున్సిపల్ కార్యాలయ పని వేళల్లో సంప్రదించాలని పేర్కొన్నారు.



నిల్వ పచ్చళ్లను తయారు చేస్తున్న మహిళలు

విలువ ఆధారిత ఉత్పత్తులతో ప్రయోజనాలు

ప్రజాశక్తి - కురుపాం

చిరుధాన్యాలతో విలువ ఆధారిత ఉత్పత్తులను తయారీ చేసుకుని మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని కెవికె గృహవిజ్ఞాన విభాగం శాస్త్రవేత్త ఉమాజ్యోతి అన్నారు. బుధవారం రస్తాకుంటుబాయి కెవికెలో గిరిజన మహిళలకు విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీపై శిక్షణ కల్పించారు. అటవీ ప్రాంతాల్లో లభించే వాక్కాయ, మునక్కాయలతో నిల్వ పచ్చళ్ల విధానం, రాగులు, సజ్జలతో ఉప ఉత్పత్తుల తయారీ తదితర వాటిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కెవికె సిబ్బంది, గిరిజన మహిళలు పాల్గొన్నారు.

17న విద్యా కమిటీ ఎన్నికలు

ప్రజాశక్తి -సీతానగరం

మండలంలోని అంటిపేట, నిడగల్లు, కొత్తవలసలో ఈనెల 17న విద్యా కమిటీ ఎన్నిక జరుగుతుందని ఎంఇఒ జి.సూర్యదేవుడు తెలిపారు. ఈనెల 8న జరిగిన ఎన్నికలను కొన్ని అనివార్య కారణాల వల్ల వాయిదా పడిన ఈ మూడు పాఠశాలలను ఎన్నికలు నిర్వహించనున్నట్టు ఆమె తెలిపారు

ఐటిఐలో మిగులు సీట్లకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

భద్రగిరి ప్రభుత్వ ఆర్ ఐటిఐలో మిగిలి ఉన్న సీట్ల భర్తీ కోసం విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ సిహెచ్ సునీల్‌కుమార్ తెలిపారు. ఫిట్టర్, ఎలక్ట్రానిక్స్ మెకానిక్, మోటారు మెకానిక్, కోపా వెల్డర్, డ్రస్ మేకింగ్ సీట్లకు ఈనెల 26 లోగా ఆన్లైన్లో దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. ఈనెల 27న వెరిఫికేషన్, 29న కౌన్సిలింగ్ ఉంటుందన్నారు.

పిబి శ్రీనివాస్ మా బంధువు కాదు

ప్రజాశక్తి - సాలూరు

జమిందార్ కుటుంబానికి చెందిన వాడినని చెప్పుకున్న పిబి శ్రీనివాస్ తమ బంధువు కాదని స్థానిక జమిందార్ కుటుంబ వారసుడు విక్రమ్ చంద్ర సన్యాసి రాజు చెప్పారు. బుధవారం ఆయన అన్న క్యాంటీన్ నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల తహశీల్దార్ కార్యాలయం ఆవరణలో ఉన్న స్థలంతో శ్రీనివాస్‌కు సంబంధం లేదన్నారు. ఆయన దుర్మార్గుడు, రౌడీ షీటర్ అని చెప్పారు. పేదలకు అన్నదానం చేయడానికి నిర్వహిస్తున్న అన్న క్యాంటీన్‌కు ఆటంకం కలిగించడం మంచిది కాదని విక్రం చంద్ర సన్యాసి రాజు చెప్పారు.

బాలికల ఆశ్రమ పాఠశాల సందర్శన

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలను సీతంపేట ఐటిడిఎ పిఒ టి.రాహుల్ కుమార్ రెడ్డి బుధవారం సందర్శించారు. విద్యార్థుల విద్యా ప్రమాణాలు గురించి తెలుసుకున్నారు. టెన్త్ విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. విద్యార్థుల ఆరోగ్యాన్ని అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థుల భోజనాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అంతకుముందు రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట డిప్యూటీ డైరెక్టర్ ఎం.అన్న దొర, ప్రధానోపాధ్యాయులు పి.పద్మశ్రీ, ఎఎంఒ పి.కోటిబాబు, వార్డెన్ పాలక అమల తదితరులు పాల్గొన్నారు.

సీతంపేటలో కుండ పోత వర్షం

ప్రజాశక్తి - సీతంపేట

సీతంపేట ఏజెన్సీలో గత 20 రోజులుగా వర్షాలు కురవకపోవడం పొలాల్లో నీరు లేక వరి నాట్లు ఎండిపోయాయి. వర్షం కోసం రైతన్నలు ఎదురుచూస్తున్నారు. చుట్టుపక్కల మండలాల్లో వర్షం అప్పుడప్పుడు కురిసినప్పటికీ సీతంపేట ఏజెన్సీలో ఎక్కడ వర్షం కురవకపోవడంతో 80శాతం వరకు ఊబలు ఉడుపులు జరగలేదు. ఆగస్టు చివర వారం వచ్చినప్పటికీ వరినాట్లు వేయకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ తరుణంలో బుధవారం కుండపోత వర్షం కురవడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే పొలాల్లో మడిగట్టు వాన నిల్వ ఉండడంతో ఈసారి చురుగ్గా ఉడుపులయ్యే అవకాశం కనిపిస్తుంది.

వరద నీటిలో మునిగిన వరి నాట్లు

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని మంగళవారం సాయంత్రం కురిసిన వర్షం కారణంగా రామవరం గ్రామపంచాయతీ అంటిపేట, రామవరం, కాజీపేట గ్రామాలలో వేసిన వరినట్లు వరద నీటిలో మునిగాయి. వెంగళరాయ సాగర్ ప్రాజెక్టు నీటి ప్రభావంతో రామవరం చెరువులో నీరు చేరడంతో దిగున ఉన్న భూముల్లోని వరి నాట్లు మునిగాయి. దీంతో మండల వ్యవసాయ అధికారి ఎస్.అవినాష్ ముంపు ప్రాంతాన్ని పరిశీలించారు.



ముంపు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

చెత్త నిర్వహణ కేంద్రాలపై దృష్టి సారించాలి

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

గ్రామాల్లో ఉండే చెత్త సంపద కేంద్రాలను అభివృద్ధి చేసి పరిశుభ్రం తొలగించే చర్యలను చేపట్టడంలో సర్పంచులు, కార్యదర్శులు కీలక పాత్ర పోషించాలని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ సర్పంచులకు, కార్యదర్శులకు గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాలు ముగింపు సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామ పంచాయతీల అభివృద్ధికి ప్రభుత్వం ప్రణాళికలను సిద్ధం చేస్తుందన్నారు. కార్యక్రమానికి ముందుగా ఆయన స్థానిక ఎంపిడిఒ కార్యాలయం నుంచి హర్ ఘర్ తిరంగా ర్యాలీలో జాతీయ పతాకాలను ప్రదర్శిస్తూ దేశభక్తి నినాదాలు చేయించారు. కార్యక్రమంలో ఎంపిపి మజ్జి శోభారాణి, ఎంపిడిఒ ఆబిద్ జావేద్, పలువురు సర్పంచులు, ఎంపిటిసిలు, పంచాయతీ కార్యదర్శులు, టిడిపి నాయకులు, పాల్గొన్నారు.

సీతానగరం : మండలంలో మూడురోజులుగా సర్పంచ్‌లకు, పంచాయతీ కార్యదర్శులకు జరుగుతున్న శిక్షణ తరగతులు బుధవారంతో ముగిసినట్టు ఎంపిడిఒ కె.కుమార్ వర్మ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన శిక్షణ కార్యక్రమాల్లో గ్రామ పంచాయతీల పరిపాలన విధానంపైనా, చెత్త సంపద కేంద్రాల నిర్వహణపైనా, గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికపై, పంచాయతీరాజ్ చట్టంపై అవగాహన పెంచుకొని పంచాయతీలను అభివృద్ధి చేయాలని కోరారు. గ్రామసభల్లో చేపట్టాల్సిన కార్యక్రమాలు పైన, గ్రామస్థాయిలో ఉండే అన్ని శాఖలపై అవగాహన కల్పించామన్నారు. రెవెన్యూపరమైన అంశాలపై తహశీల్దార్ జె.రాములమ్మ వివరించారు. కార్యక్రమంలోఎంపిపి ప్రతినిధి శ్రీరాములునాయుడు, ఎ.ఒ.ప్రసాద్, వివిధ శాఖల అధికారులు, రిసోర్స్ పర్సనులు శశి భూషణరావు, మనోహర్, శ్రీనివాసరావు, పీటర్, సర్పంచులు కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

సీతంపేట : పంచాయతీ రాజ్ చట్టాల గురించి అవగాహన కలిగి ఉండాలని డిఎల్‌పిఒ నాగభూషణరావు అన్నారు. స్థానిక వైటిసిలో బుధవారం సర్పంచులు, కార్యదర్శులకు మూడో రోజు జరిగిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సర్పంచులు, కార్యదర్శులు బాధ్యతలు, విధులు గురించి తెలుసుకోవాలన్నారు. పంచాయతీలకు చెత్త సంపద కేంద్రాల ద్వారా ఆదాయాలు చేకూర్చుతాయన్నారు. పంచాయతీ నిర్వహణ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ గీతాంజలి, ఇఒపిఆర్‌డి కొండపల్లి సత్యం తదితరులు పాల్గొన్నారు.

కొమరాడ : గ్రామాలను అభివృద్ధి చేసే బాధ్యత సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులదేనని ఎంపిడిఒ ఎం.మల్లికార్జునరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులకు గత మూడు రోజులుగా జరిగిన శిక్షణ ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోని పారిశుధ్యం, వీధిలైట్లు, సాలిడ్ వేస్టేజ్ మేనేజ్మెంట్ తదితర అంశాలపై సర్పంచులకు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ శిక్షణా కార్యక్రమంలో పూర్తిస్థాయిలో అవగాహన కల్పించుకొని గ్రామాలను శుభ్రంగా ఉంచేందుకు కషిచేయలని సూచించారు. ముఖ్యంగా ఈ సీజన్‌లో పారిశుధ్యం పనులు సక్రమంగా చేయించి, గ్రామాల్లో ఎటువంటి రోగాల బారిన ప్రజల పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కాలువల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించి క్లోరేషన్ చేయించి ప్రజలకు రక్షిత మంచినీటి పథకం ద్వారా తాగునీరు అందించాలని కోరారు. ప్రతి గ్రామంలో వీధిలైట్లు సక్రమంగా వెలిగేలా పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు కృషి చేయాలని సూచించారు. ఈ శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకొని గ్రామాల అభివృద్ధికి పూర్తిస్థాయిలో పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎఒ రమేష్, ఇఒపిఆర్‌డి రాధాకృష్ణ, పలువురు సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



సీతంపేట : శిక్షణలో మాట్లాడుతున్న డిఎల్‌పిఒ నాగభూషణరావు



గోతుల వద్ద ఎర్రజెండా పాతి, నిరసన తెలుపుతున్న వాహనచోదకులు, గ్రామస్తులు

గోతుల వద్ద ఎర్రజెండా ఎగురవేస్తూ నిరసన

ప్రజాశక్తి - కొమరాడ

పార్వతీపురం నుంచి కూనేరు వరకు గల అంతర రాష్ట్ర రహదారిపై ఉన్న గోతులు మరమ్మతులు చేసి ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. కొమరాడ వద్ద అంతర్రాష్ట్ర రహదారిపై ఏర్పడిన గోతులు వద్ద సిపిఎం ఆధ్వర్యంలో ఎర్రజెండా పాతి బుధవారం నిరసన చేపట్టారు. ఈ నిరసనను ఉద్దేశించి ఆయన మాటాల్డఉతూ అంతరాష్ట్ర రహదారిపై ఏర్పడ్డ పెద్ద గొయ్యిల్లో నీరు నిల్వ ఉండడంతో ఆ గొయ్యి వద్ద ఇప్పటికే వాహనదారులు ప్రమాదాలకు గురై కాళ్లు, చేతులు విరిగిపోవడం తో చనిపోయే పరిస్థితి ఉందని తెలిపారు. ప్రతిరోజు మూడు రాష్ట్రాలకు వెళ్లే వాహన దారులు అడుగడుగు ఇబ్బందులు పడుతూ, గంటల కొద్దీ ట్రాఫిక్ లో ఉండిపోయే పరిస్థితి నెలకొందన్నారు. ప్రయాణికుల ఇబ్బందులపై సిపిఎం ఆధ్వర్యాన పలుమార్లు వివిధ రూపాల్లో నిరసన తెలిపినా పాలకులు, అధికారులకు పట్టడంలేదని విమర్శించారు. వెంటనే పార్వతీపురం నుండి కు నేరు మీదుగా మూడు రాష్ట్రాలకు వెళ్లే రహదారి మార్గంలో గోతులను కప్పి అటు వాహనదారులకు ఇటు ప్రయాణికుల ప్రాణాలను కాపాడాలని కోరుతూ ఆ గొయ్యి వద్ద ప్రమాదానికి సూచనగా ఎర్రజెండా పాతి పెట్టామన్నారు. ఈనెల 21లోగా గోతులు పూడ్చాలని లేకుంటే ప్రయాణికులతో కలిసి రిలే నిరాహార దీక్ష చేస్తామని హెచ్చరించారు. కార్యక్ర మంలో స్థానిక యువకులు, ప్రయాణికులు పాల్గొన్నారు.

ఆక్రమణ స్థలం సర్వే

ప్రజాశక్తి -పాచిపెంట

మండలంలోని కొటికిపెంట పంచాయితీ కొత్తవలసలో ఆక్రమణకు గురైన రహదారి స్థలాన్ని బుధవారం స్థానిక తహశీల్దార్ డి.రవి, సర్వేయర్, ఆర్ఐ, వీఆర్వో పరిశీలించి ఆక్రమదారునికి హెచ్చరించారు. రోడ్డును ఆక్రమించిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలంటూ సిపిఎం ఆధ్వర్యాన కొత్తవలస గ్రామ గిరిజనులు మంగళవారం తహశీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఆక్రమణకు గురైన రహదారిని బుధవారం అధికారులు పరిశీలించి ప్రస్తుతం నడుస్తున్న రహదారిని యధావిధిగా విడిచిపెట్టాలని ఆక్రమణదారుడికి సూచించారు. అలాగే నీ వద్ద ఏమైనా ఆధారాలుంటే తహశీల్దార్ కార్యాలయానికి తీసుకురావాలని అతనికి అధికారులు సూచించారు.

అనారోగ్యంతో కిల్లాడ కార్యదర్శి మృతి

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలో కిల్లాడ కార్యదర్శి ఎ.అప్పలస్వామి బుధవారం వీరఘట్టం మండలం ఎన్‌కె రాజపురం స్వగ్రామంలో మృతి చెందారు. విషయం తెలిసిన వెంటనే ఎంపిడిఒ కె.గీతాంజలి, ఇఒపిఆర్‌డి కె.సత్యం, స్థానిక మండల ప్రజా పరిషత్ అధికారులు, కార్యదర్శులు సంతాపం తెలిపారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తు వ్యవసాయ కార్మికసంఘం నాయకులు

సాగు చేస్తున్న భూములకు పట్టాలు ఇవ్వాలి

- అన్యాక్రాంతమైన భూములు పేదలకు తిరిగి ఇవ్వాలి
- ప్రజాసంఘాల ఆధ్వర్యాన 19న కలెక్టరేట్ వద్ద ధర్నా

ప్రజాశక్తి - పాలకొండ

సాగు చేస్తున్న భూములకు పట్టాలివ్వాలని, అన్యాక్రాంతమైన భూములను తిరిగి పేదలకు ఇవ్వాలని కోరుతూ ఈనెల 19న కలెక్టరేట్ వద్ద ప్రజాసంఘాలు తలపెట్టిన ధర్నాలో పేదలంతా పాల్గొనాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు దూసి దుర్గారావు పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం పాలకొండలో చలో కలెక్టరేట్ పోస్టర్‌ను ఆవిష్కరణ నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ పేదలు, గిరిజనులు కొండ పోరంబోకు భూమి, అటవీ భూమి గత 25 ఏళ్ల నుంచి సాగు చేసుకుంటున్నారని, కానీ ఇంత వరకు పట్టాలు ఇవ్వలేదని, పాలకొండ మండలంలో వివిధ గ్రామాలతో పాటు గిరిజన ప్రాంతంలో అనేక గ్రామాల్లో పేదల భూములు అన్యాక్రాంతమయ్యాయని, వాటిని పేదలకు తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలన్నింటిపై ఈనెల 19న కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా జరుగుతుందని, దీనికి భూ సమస్యలున్నవారంతా రావాలని కోరారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు రాయవలస లక్ష్మీనారాయణ, ధారా భుజంగరావు, సామంతుల మురళి, కూరాకుల లక్ష్మము, జి.సింహాచలం తదితరులు పాల్గొన్నారు.



పిఒను సన్మానిస్తున్న ఐటిడిఎ అధికారులు, సిబ్బంది

ఐటిడిఎ పిఒకు ఘనంగా వీడ్కోలు

ప్రజాశక్తి -సీతంపేట

స్థానిక ఐటిడిఎ పిఒగా పనిచేస్తూ పశ్చిమ గోదావరి జాయింట్ కలెక్టర్‌గా బదిలీపై వెళ్తున్న టి.రాహుల్ కుమార్ రెడ్డిని బుధవారం ఐటిడిఎ ఉద్యోగులు సన్మానించి, ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ సీతంపేట ఐటిడిఎ పిఒగా కొద్దిరోజులే పనిచేసినప్పటికీ చాలా నేర్చుకొన్నానన్నారు. సీతంపేట ఏజెన్సీ ప్రాంతం చాలా బాగుందన్నారు. కార్యక్రమంలో ఎపిఒ చిన్నబాబు, డిడి అన్నాదొర, పిహెచ్ఒ గణేష్, ఎపిడి శ్రీహరి, ఎంపిడిఒ కె.గీతాంజలి, కోటిబాబు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుంచే మొక్కలు నాటాలి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

విద్యార్థి దశ నుంచే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడం అలవాటు చేసుకోవాలని హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ అధికారులు అన్నారు. స్థానిక హెచ్‌డిఎఫ్‌సి బ్రాంచి ఉద్యోగుల ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా బుధవారం పట్టణంలోని బెలగాంలో గల బ్రాంచి పాఠశాల మైదానంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ ఆపరేషన్ క్లస్టర్ హెడ్ శ్రీకాకుళం, విజయనగరం డివిజన్ నర్రా సత్యప్రసాద్ బ్రాంచ్ మేనేజర్ గొర్లె అశోక్, ఆపరేషన్ మేనేజర్ వికెఎల్ఎన్ సాహు, పాఠశాల హెచ్ఎం వి.వరప్రసాదరావు, సిబ్బంది, స్కూల్ యాజమాన్యం, విద్యార్థులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ కుటుంబాన్ని పరామర్శించిన మంత్రి

ప్రజాశక్తి - సాలూరురూరల్

కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతూ ఇటీవల మరణించిన జీగిరాం మాజీ సర్పంచ్ పెదిరెడ్ల అప్పారావు కుటుంబాన్ని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమశాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో పార్టీ అభివృద్ధికి ఎనలేని సేవలు అందించిన అప్పారావు మరణం చాలా బాధాకరమైన విషయమని అన్నారు. వారి కుటుంబాన్ని పార్టీ అన్ని విధాలా ఆదుకుంటుందని తెలిపారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు ఆముదాల పరమేష్, బూస తవుడు, డొంక అన్నపూర్ణ, శ్యామ్ నాయకులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ సస్పెన్షన్?

మక్కువ: మండలంలోని ములక్కాయవలస మోడల్ పాఠశాల ప్రిన్సిపాల్ స్వర్ణలతను సస్పెండ్ చేశారు. నిబంధన ప్రకారం ఎస్ఎంసి ఎన్నికలు నిర్వహించలేదన్న అభియోగంపై గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేయగా, మంత్రి సంధ్యారాణి ఆదేశాల మేరకు విచారణ జరిపి బుధవారం సస్పెన్షన్ చేశారు.

శివ్వాం బాధితుల రిలే దీక్షలకు ఎస్ఎఫ్ఐ మద్దతు

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

గరుగుబిల్లి మండలం శివ్వాం దళితులపై దాడి చేసిన వారిని శిక్షించాలని, జిల్లాలో భూ సమస్యలు పరిష్కరించి గిరిజనులు, దళితులు, పేదలకు న్యాయం చేయాలని కోరుతూ నెల రోజులుగా కలెక్టర్ కార్యాలయం ఎదుట కొనసాగిస్తున్న రిలే నిరాహార దీక్షల్లో బుధవారం ఎస్ఎఫ్ఐ నాయకులు పాల్గొని తమ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు డి.పండు, కె.రాజు మాట్లాడుతూ జిల్లాలో పెత్తందారులు దళితులపై దాడులు చేస్తుంటే అధికారులకు ఏమీ పట్టినట్టు వ్యవహరించడం దుర్మార్గమన్నారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని దాడులు చేస్తున్న వారికి అధికారి యంత్రాంగం మద్దతుగా నిలుస్తుందని విమర్శించారు. ఏళ్ల తరబడి సాగుభూముల సమస్యలు పరిష్కరించాలని పోరాడుతుంటే అధికారులు తూతూ మంత్రంగా సర్వేలు జరిపి నాన్చుడు ధోరణి అవలంభిస్తున్నారని విమర్శించారు. దీనివల్ల భూ సమస్యలు పెరిగిపోతున్నాయి తప్ప నిరుపేదలకు సమస్య పరిష్కారం కాలేదన్నారు. ఇప్పటికైనా కలెక్టర్ చొరవ చూపి శివ్వాం దళిత కుటుంబాలకు న్యాయం చేసి, దాడులు చేసిన వారిని కఠినంగా శిక్షించాలని, భూ సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు కె.డేవిడ్. హెచ్ సింహాచలం, కె.శ్రీను, సిహెచ్.బాబూరావు, తదితరులు పాల్గొన్నారు.

సాగునీటికి అన్నదాతలు అవస్థలు

ప్రజాశక్తి - వీరఘట్టం

గత కొద్ది రోజుల నుండి సాగు నీటి కోసం ఆరాటం పడుతున్నామని అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేశారు. వర్షాలపైన ఆధారపడి పంటలు సాగు చేస్తున్నామని, ప్రస్తుతం వానలు ఎండగట్టడంతో లక్ష్మీ సాగరం చెరువులోకి నీరు చేరడంలేదని రైతులు రాములు, పెంటయ్య, అసిరయ్య, రామారావు, వెంకట్రావు, లచ్చయ్య, తదితరలు తెలిపారు. చెరువు ఆయకట్టు సుమారు వందెకరాలు పైబడి పంటలు సాగు చేస్తున్నప్పటికీ వర్షాలు కురవక వరి దుబ్బులు ఎండుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే పంటలు నష్టపోయే పరిస్థితి ఎదురవుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే వేలాది రూపాయలు పెట్టుబడులు పెట్టి పంటలు సాగు చేసినప్పటికీ వరి నారుమడులు ఎండిపోతున్నాయని దీంతో ఏం చేయాలో దిక్కుతోచని స్థితిలో ఉన్నామని వాపోతున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి సాగునీటి సమస్య పరిష్కారానికి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఎల్ఐసి ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శిగా ధర్మారావు

ప్రజాశక్తి - సాలూరు

జీవిత భీమా సంస్థ (ఎల్ఐసి) ఉద్యోగుల సంఘ పార్వతీపురం బేష్ యూనిట్ జనరల్ సెక్రటరీగా టెక్కలి ధర్మారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ధర్మారావు జనరల్ సెక్రటరీగా ఇంతవరకు మూడు సార్లు పని చేశారు. అధ్యక్షునిగా ఆర్‌వి ప్రసాద్, సహాయకార్యదర్శిగా వి.ఆదిత్య, కోశాధికారిగా ఆర్.కోటేశ్వరావు, కార్యవర్గసభ్యులుగా ఎస్.హారిక, కె.అనిల్ కిరణ్, పి.సూర్యనారాయణ ఎన్నికయ్యారు. ఎన్నిక పరిశీలకులుగా విశాఖ డివిజన్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు ఎం.కామేశ్వరి, నాయకులు సతీష్, మూర్తి, జి.సిద్ధార్థ తదితరులు హాజరయ్యారు.



ఫీల్డ్ అసిస్టెంట్‌కు నియామక పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

గిరిశిఖర గ్రామాల్లో ఉపాధి హామీ అమలు

ప్రజాశక్తి - సాలూరురూరల్

గిరిశిఖర గ్రామాల్లో గిరిజనులకు ఉపాధి కల్పించే ధ్యేయంతోనే గంజాయిభద్ర, సంపంగిపాడు పంచాయతీలకు ఉపాధి హామీ క్షేత్ర సహాయకులను నియమించినట్టు స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధి లేక సుదూర ప్రాంతాలకు వెళ్లే ఇక్కడ గిరిజనులకు వారు ఉన్న గ్రామాల్లో పని కల్పించడానికి ప్రభుత్వం నుంచి పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని అన్నారు. అనంతరం కొత్తగా నియమించబడిన ఫీల్డ్ అసిస్టెంట్లకు నియామక పత్రాలను మంత్రి అందజేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ జి.పార్వతి, ఎపిఒ రామకృష్ణ, మండల టిడిపి అధ్యక్షులు ఆముదాల పరమేష్ పాల్గొన్నారు.

జియ్యమ్మవలస :మండలంలోని పిటి మండ ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్‌గా కొండగొర్రి తిరుపతి ను నియమించారు. ఈ మేరకు ఎంపిపి బొంగు సురేష్ ఆధ్వర్యంలో కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి నియామకపత్రాన్ని అతనికి అందించారు. కార్యక్రమంలో ఎపిఒ శ్రీనివాస్, సర్పంచ్ సుందరరావు,చలపతి రావు తదితరులు పాల్గొన్నారు

ముమ్మరంగా వాహనాలు తనిఖీ

ప్రజాశక్తి - కురుపాం

స్థానిక శోభలతాదేవి కాలనీలో ఎస్సై షణ్ముఖరావు ఆధ్వర్యంలో బుధవారం ముమ్మరంగా వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి వాహనదారుడు హెల్మెట్ ధరించాలని, లైసెన్స్ పత్రాలను కలిగి ఉండి వాహనాలు నడపాలని, ఎవరైనా ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమించినా వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం పలు వాహనచోదకులకు జరిమానాలు విధించారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ దొర, సిబ్బంది అశోక్, భద్ర పాల్గొన్నారు.

కుడ్డపల్లిలో పొలంబడి

సీతంపేట : మండలంలోని కుడ్డపల్లిలో పొలంబడి కార్యక్రమం మండల వ్యవసాయ అధికారి పి.శ్రీదేవి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు ఈ సందర్భంగా వరిలో పాటించాల్సిన సమగ్ర సస్యరక్షణ చర్యలు గురించి వివరించారు. నారు కొనలు తుచడం, సరైన మొక్కల సాంద్రత, నానో యూరియా, డిఎపి వాడకం గురించి ఎడిఎ రత్నకుమారి వివరించారు. అనంతరం కంది విత్తనాలు అందించారు. కార్యక్రమంలో విఎఎ లావణ్య, రైతులు పాల్గొన్నారు.

నిరంతర ఆదాయాన్ని ఇచ్చే కూరగాయల నమూనాలు తయారీ

పాచిపెంట : ప్రస్తుతం కూరగాయలు పండించే రైతులు విచక్షణారహితంగా పురుగుమందులు, రసాయన ఎరువులు వాడడం వల్ల వాటి అవశేషాలు కూరగాయలు, ఆకుకూరల్లో ఉండటం వల్ల వాటిని తినే మానవాళికి అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని, ఈ సమస్యను అధిగమించడానికి, నిరంతరం రైతుకు ఆదాయాన్నిచ్చే నమూనాలను ఏర్పాటు చేయడం ఎంతో అవసరమని మండల వ్యవసాయ అధికారి కె.తిరుపతిరావు తెలిపారు. మండలంలోని బైరిగుడ్డిలో గిరిజన రైతు గుంట కృష్ణ పొలంలో 25 సెంట్లులో కూరగాయల మోడల్‌ను వేశారు. ఈ పద్ధతిలో ప్రతి నాలుగు మీటర్ల బెడ్డుకు ఒక చిన్న కాలువ ఏర్పాటు చేసుకోవాలని, ఎత్తు తక్కువగా ఉన్న ఆకుకూరలను మొదటి వరుసలో క్రమంగా ఎత్తుగా ఉన్న కూరగాయలను తదుపరి వరుసల్లో వేసుకుని గట్టు చుట్టూ బంతి వంటి పూల మొక్కలు వేసుకోవాలని చూశారు. గట్ల మీద కంప ఏర్పాటు చేసుకొని పాదు రకాల కూరగాయలను వేసుకోవాలన్నారు. లి ఈ ప్రణాళిక అంతా తూర్పు నుంచి పడమర వైపుకి వేసుకోవాలని, ఒక పంట పూర్తయిన వెంటనే మరొక పంట ఆదాయానికి వచ్చేలా ప్రణాళికా బద్ధంగా సాగు చేపట్టాలని తెలిపారు. ముందుగా ఘన జీవామృతాన్ని పొలంలో చల్లుకున్నాక మొక్కలను నాటుకోవాలన్నారు. అనంతరం ప్రతి వారం ద్రవ జీవామృతాన్ని వేసుకోవాలని సూచించారు. అవసరాన్ని బట్టి ముందు నుండే నీమాస్త్రం బ్రహ్మాస్త్రం వంటి కషాయాలను పిచికారి చేసుకోవాలని తెలిపారు. అనంతరం పాంచాలిలో రైతు మునకాల భీమరాజు తన ఎకరా వరి పొలాన్ని పూర్తిగా ప్రకృతి సేద్య పద్ధతులో పండిస్తున్నారు. దీనికిగాను ప్రతి పది రోజులకు ఒకసారి 200 లీటర్ల ద్రవ జీవమృతాన్ని నాలుగు, ఐదుసార్లు వేసుకుంటే దిగుబడి తగ్గకుండా నాణ్యమైన బియ్యం వస్తాయని వ్యవసాయ అధికారి తెలిపారు. ఈ కార్యక్రమంలో విఎఎ సాయి గణేష్, శ్రీను ప్రకృతి సేద్య ప్రతినిధులు సూర్యారావు, యశోదమ్మ, తిరుపతి నాయుడు, సుకరమ్మ, రైతులు పాల్గొన్నారు

ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

హర్ ఘర్ తిరంగ కార్యక్రమంలో భాగంగా స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకొని కేంద్రప్రభుత్వం పంపిన జాతీయ జెండాను స్థానిక తపాలా ఉద్యోగులు కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి బుధవారం అందజేశారు. అనంతరం స్వాతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరాలని, త్యాగమూర్తుల స్వాతంత్ర ఫలాలు ప్రతి ఒక్కరికీ వివరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తపాలా ఉద్యోగులు దినేష్ కుమార్, రవి, వేణుగోపాల్, చిన్నంనాయుడు, రాజేష్, శంకరరావు, బాబురావు, కాంతారావు, మణి ఉన్నారు.

మెరుగైన విద్య వైద్యం అందించాలి

ప్రజాశక్తి - గరుగుబిల్లి

విద్యార్థులకు మెరుగైన విద్య, వైద్య సదుపాయాలు అందించాలని రెండో జిల్లా జడ్జి, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ ఎస్. దామోదరరావు తెలిపారు. బుధవారం రావివలస కెజిబివిని ఆయన తనిఖీ చేశారు. హాస్టల్‌లో గల వసతులు, సమస్యల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. వసతిగృహంలో విద్యార్థినిలకు అందిస్తున్న భోజనం, వసతి, మరుగుదొడ్లను తనిఖీ చేశారు. విద్యార్థినిలకు ఏమైనా సమస్యలుంటే తెలియజేయాలన్నారు.